ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 23 జూన్ 2024



అధికారమే అండగా వేల కోట్ల రూపాయల ప్రజా సంపదను కొల్లగొట్టినట్లు తేలిపోయింది. దీనివెనుక అక్రమార్కులెవరో కూడా గుర్తించారు. మైనింగ్ శాఖ తన పరిధి మేరకు జరిమానాలు కూడా విధించింది. కానీ ప్రభుత్వ భూములను కుళ్లబొడిచి ప్రకృతిని నాశనం చేసిన దోపిడీదారులపై చర్యలకు మాత్రం రెవెన్యూ శాఖ వెనకాడుతోంది. ప్రభుత్వ భూమిలో అనుమతుల్లేకుండా మట్టి ఎత్తితేనే కేసులు పెట్టే రెవెన్యూ అధికారులు ఇప్పుడు రూ.వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ వంటి ఖనిజాన్ని తవ్వి తరలించుకుపోతే మౌనంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కుళ్లబొడిస్తే కునుకు తీస్తారేం!?

- బట్టబయలైన క్వార్ట్జ్ దోపిడీ
- ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు
- రూ.వేల కోట్ల ప్రజల సంపద స్వాహా
- క్రిమినల్ కేసులు పెట్టని రెవెన్యూ శాఖ
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : తెల్లరాయి (క్వార్ట్జ్) రూపంలో వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంతా కాదు. వైసీపీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో క్వార్ట్జ్‌కు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఏర్పడటంతో గద్దల్లా వాలిపోయారు. అది ప్రభుత్వ భూమినా.. పట్టా భూమినా.. అన్న సంబంధం లేకుండా సైదాపురం, పొదలకూరు, రాపూరు, చేజర్ల మండలాల్లో ఇష్టానుసారం తవ్వేశారు. ఈ ఖనిజాన్ని అక్రమ మార్గంలో దేశం దాటించి రూ.వేల కోట్లు గడించారు. నాడు ఈ దోపిడీ జోలికి వెళ్లేందుకు భయపడిన మైనింగ్ అధికారులు ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రంగంలోకి దిగారు. తవ్విన చోటల్లా కొలతలు తీసి ఏ స్థాయిలో క్వార్ట్జ్‌ను తరలించారో నిర్ధారించారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలోనే దాదాపు 4 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను తవ్వి తరలించినట్లు నిర్ధారించారు. అంతకముందు కూడా జరిగిన తవ్వకాలను నిగ్గు తేల్చి మొత్తంగా రూ.255 కోట్ల పెనాల్టీ విధించారు. ఈ మేరకు ఎక్కడికక్కడ మైనింగ్ అధికారులు పంచనామా నిర్వహించి అక్రమంగా తవ్వకాలు జరిపిన వారికి పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మరో లక్ష మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉంచగా దానిని కూడా మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మొత్తంగా క్వార్ట్జ్ అక్రమాలకు సంబంధించి మైనింగ్ శాఖ తన పరిధిలో 275 కేసులను బుక్ చేసింది. మైనింగ్ చట్టాల ప్రకారం పెనాల్టీ వసూళ్ల ప్రక్రియ జరుగుతోంది. ఇక్కడివరకూ బాగానే ఉంది.

స్పందించని రెవెన్యూ శాఖ

అయితే ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా తవ్వేస్తే రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. ఈ తవ్వకాల మూలంగా ప్రజాధనం దోపిడీ జరగడమే కాకుండా పర్యావరణపరంగా కూడా తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. ఈ అక్రమ తవ్వకాలు జరిపింది ఎవరన్నది మైనింగ్ అధికారుల విచారణలో తేటతెల్లమైంది. వీరిలో మెజారిటీ వ్యక్తులు వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఇంతవరకూ రెవెన్యూ శాఖ ఒక్క పోలీసు కేసు కూడా పెట్టక పోవడం గమనార్హం. అప్పటి ఎమ్మెల్యేల ఒత్తిడితో తహసీల్దార్లు, జిల్లా ఉన్నతాధికారులు కూడా అక్రమ తవ్వకాలను చూసీచూడనట్లు వదిలేశారు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అక్రమ క్వార్ట్జ్ మైనింగ్ దోపిడీ బట్టబయలైంది. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల్లో అను మతుల్లేకుండా విలువైన ఖనిజాన్ని తరలించడంపై రెవెన్యూ శాఖ క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంది. ఇది జరిగితేనే క్వార్ట్జ్ అక్రమాల వెనుక అసలు దొంగలు ఎవరన్నది బయటపడు తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే అక్రమార్కుల్లో వణుకు మొదలవుతుందని, భవిష్యత్‌లో మరొకరు ఈవిధంగా చేసేందుకు భయపడుతారన్న చర్చ జరుగుతోంది. రూ.వేల కోట్లు దోచుకున్న అక్రమార్కులకు రూ.వందల కోట్లు పెనాల్టీలు చెల్లించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ వారు చేసిన తప్పులకు శిక్ష ఏమిటన్నదే ఇక్కడ అసలు ప్రశ్నగా మారింది.

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం

అనుమతుల్లేకుండా క్వార్ట్జ్ తవ్వకాలు జరపడంపై విచారణ జరిపి రూ.255 కోట్ల పెనాల్టీలు విధించాం. ప్రభుత్వ భూముల్లో జరిగిన తవ్వకాల వివరాలను తెలుసుకుంటాం. తదుపరి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఎం హరినారాయణన్, కలెక్టర్



వేమిరెడ్డి దంపతులతో భేటీ అయిన మంత్రులు, ఎమ్మెల్యేలు

'క్వార్ట్జ్' అక్రమాలపై సీబీఐతో విచారణ

- వీపీఆర్ నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేల తీర్మానం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 22 : జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తీర్మానించారు. అలాగే, ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేద్దామని నిర్ణయించుకున్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు శనివారం తాడేపల్లిలోని తమ నివాసంలో భేటీ అయ్యారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే అంశాలపైనా వారు చర్చించారు.

నల్లబజారుకు నాడు-నేడు సామగ్రి

- ఓ హెచ్‌ఎం నిర్వాకం
- అడ్డుకున్న గ్రామస్థులు

సంగం, జూన్ 22: పాఠశాలలో నాడు-నేడు పనులు చేయగా మిగిలిన సామగ్రిని నల్లబజారుకు తరలిస్తున్న ప్రధానోపాధ్యాయుడి నిర్వాకాన్ని గ్రామస్థులు అడ్డుకున్న సంఘటన శనివారం సంగం మండలంలోని అనసూయనగర్‌లో జరిగింది. నాడు-నేడు పథకంలో మొదటి విడత కింద పాఠశాలలో రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.24 లక్షలు, మౌలిక వసతుల కల్పనకు కింద మరో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు కూడా పూర్తయ్యాయి. అయితే, మిగిలిపోయిన టైల్స్, ఇతర సామగ్రిని శనివారం ప్రధానోపాధ్యాయుడు ట్రాక్టర్‌కు లోడ్ చేస్తుండగా, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు నిలదీశారు. దీంతో ఆయన ఎంఈవో పంపించమన్నారని చెప్పారు. గ్రామస్థులు ఎంఈవో జానికీరామ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన హెచ్‌ఎంను ప్రశ్నించగా ఏవేవో చెప్పి బుకాయించారు. దీంతో హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ అందచేశారు. హెచ్‌ఎం నిర్వాకంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని ఎంఈవో తెలిపారు.




ట్రాక్టర్‌కు టైల్స్‌ను లోడ్ చేస్తున్న కూలీలు

- ఏటా వైద్య శాఖ లక్ష్యం వెయ్యి.. చేసింది మాత్రం 11 మందికే..!
- అపోహలు వీడాలంటున్న వైద్యులు
- కొరవడిన కుటుంబ నియంత్రణ ప్రచారం

"వేసక్టమా... నాకు వద్దులే బా. ఉద్యోగం చేసేటోడ్ని. అలసట ఉంటుంది. లేనిపోని ఆరోగ్య సమస్యలు వస్తాయి. నాకెందుకు!?" ఇదండీ మగవారి వరస. కుటుంబ నియంత్రణలో (కు.ని) భాగంగా వేసక్టమి ఆపరేషన్ చేయించుకునే మగవారి సంఖ్య జిల్లాలో చాలా తక్కువగా ఉంది. ఈ ఆపరేషన్ చేయించుకుంటే మగతనం తగ్గుతుందన్న అపోహ చాలామందిలో ఉంది. ఈ అపోహలు వీడాలని వైద్యులు చెబుతున్నా ససేమీరా అంటున్నారు. కు.ని అంటే అది కేవలం మహిళలకు మాత్రమే అన్న భావన అన్ని వర్గాల్లోనూ పాతుకుపోయింది. ఏటా వైద్య ఆరోగ్య శాఖ వేసక్టమి ఆపరేషన్లు చేయాలని వెయ్యిలోపు లక్ష్యాలను నిర్దేశిస్తున్నా కేవలం 11 మంది మాత్రమే వేసక్టమి చేశారు. దీంతో లక్ష్యాలు చేరుకోవడం లేదు.

- నెల్లూరు (వైద్యం)



జనాభా నియంత్రణ లేక పోవటం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులతోపాటు ప్రభుత్వాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1952లో జనాభా నియంత్రణకు శ్రీకారం చుట్టింది. అయితే నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కు.ని లక్ష్యాలపై పెద్దగా దృష్టి సారించలేదు. జిల్లాలో 15వేల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్ణయించగా, ఇందులో 50 శాతం కూడా పూర్తి కాలేదు.

జనాభాకు అనుగుణంగా లక్ష్యాలేవి?

జిల్లాలో జనాభాకు అనుగుణంగా కుటుంబ నియంత్రణ లక్ష్యాలు సాధించటంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమవుతో ంది. ప్రస్తుతం జిల్లాలో 26.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతి ఏటా జిల్లా జనాభా పెరుగుతూనే ఉంది. ప్రతి ఏటా 45వేల ప్రసవాలు జరుగుతుండగా, ఇందులో 30వేలమంది ప్రసవాలు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులలోనే జరుగుతున్నాయి. మిగిలినవి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహిళలకు నిర్వహించే ట్యూబెక్టమి శస్త్రచికిత్సలు తప్ప, మగవారికి నిర్వహించే వేసక్టమి చికిత్సలు జరగడం లేదు. గత ఏడాది 737 వేసక్టమి శస్త్రచికిత్సలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, కేవలం ఇప్పటి వరకు 11 మందికి మాత్రమే జరిగాయి.

తగిన ప్రచారం ఏది..?

జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ వేసక్టమి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వేసక్టమి పట్ల మగవారిలో నెలకొన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయటంలో తగిన ప్రచారం చేపట్టడం లేదు. పట్టణాలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోనే కుటుంబ నియంత్రణలపై విస్తృత ప్రచారం చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు. జనాభా నియంత్రణ లక్ష్యాలు నెరవేరకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇద్దరు పిల్లలు పుట్టగానే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకోవాలని ప్రజల్లో తగిన అవగాహన ఉన్నా, ఎక్కువగా ఆడవారే ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటున్నారేకానీ మగవారు వేసక్టమి ఆపరేషన్లు మాత్రం చేయించుకోవడం లేదు.

జిల్లాలో కు.ని శస్త్రచికిత్సలు		
సంవత్సరం	వేసక్టమి	ట్యూబెక్టమి
2019 - 20	11	9769
2020 - 21	0	5662
2021 - 22	0	5305
2022 - 23	10	6181
2023 - 24	11	6857

విస్తృతంగా ప్రచారం చేపడుతాం..

వేసక్టమిపై విస్తృత ప్రచారం చేపడుతాం. గ్రామస్థాయిలో ఈ శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. మగతనం తగ్గుతుందని, కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాల్సి వస్తుందన్న అపోహలు మగవారిలో ఇంకా ఉన్నాయి. వారిలో ఉన్న అపోహలు తొలగిస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (హరనాథపురం) : ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులంతా తమ పరిధిలోని అర్జీలను మీకోసం వెబ్‌సైట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాయగూరల ధరలు స్థిరీకరించండి!

అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి తెప్పించండి

అక్రమ నిల్వలపై సోదాలు చేయండి: జేసీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ఉల్లిపాయలు, టమోటా ధరలు పెరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. ఎండ వేడిమి ప్రభావంతో ఉల్లిపాయలు, టమోటాలతోపాటు ఇతర కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, దీంతో ధరలు పెరిగినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి కాయగూరలను సేకరించి రైతుబజార్లలో విక్రయించేలా చూడాలని ఆదేశించారు. మార్కెటింగ్, పౌరసరఫరాలు, తూనికల కొలతలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ ద్వారా వ్యాపారుల దుకాణాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా అవసరానికి మించి ఎక్కువ స్టాకు నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి, వ్యవసాయాధికారి సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డీఎస్వో వెంకటరమణ, తూనికల కొలతల శాఖ డీసీ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

నేటినుంచి వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలోని వెంగమాంబ పేరంటాల అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. సుదూర ప్రాంతాల ననుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలకమండలి, అధికారులు సర్వంసిద్ధం చేశారు. అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్స వాలకు వెంగమాంబ వంశస్థులైన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొస్తారు. నియమనిష్టలతో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. వెంగమాంబ దేవర ఇంట్లో జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు భారీగా పాల్గొంటారు. అలాగే వెంగమాంబ స్వగ్రామం వడ్డిపాళెం పచ్చవ దేవర ఇంట్లో పసుపు దంచే కార్యక్రమం కనులపండువగా నిర్వహించనున్నారు. పసుపు దంచేందుకు మహిళలు పోటీ పడతారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వలస వెళ్లిన వారు కుటుంబాలతో సహా గ్రామాలకు చేరుకొంటుండటంతో సందడి నెలకొంది. వెంగమాంబ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున పేరంటాలు, వివిధ దేవతామూర్తుల ప్రభలను ఏర్పాటు చేశారు.

45 ప్రత్యేక బస్సులు

నెల్లూరు (క్రైం) : వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు 45 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రజారవాణా జిల్లా అధికారి వీవీ శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్లతోపాటు ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు బస్టాండ్ల నుంచి ఈ బస్సులు నడుస్తాయని, రద్దీ పెరిగితే బస్సుల సంఖ్య పెంచుతామని పేర్కొన్నారు.

కల్యాణ వైభోగమే!

భక్తజనంతో కిక్కిరిసిన గంగపట్నం



కల్యాణ వేదికపై త్రిశూలేశ్వరస్వామి, చాముండేశ్వరిదేవి ఉత్సవర్లు

ఇందుకూరుపేట, జూన్ 22 : వేదపండితుల మంత్రోచ్ఛరణ.. మంగళ వాయిద్యాలు.. అతిథులుగా తరలివచ్చిన భక్త జనం నడుమ గంగపట్నంలోని త్రిశూలేశ్వర స్వామి, చాముండేశ్వరి దేవిల కల్యాణం శనివారం తెల్లవారుజామున అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈవో బండి శాంతయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో 18 మంది స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపునకు శ్రీకారం

నెల్లూరు (వైద్యం), జూన్ 22 : వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో విధులకు దుమ్మా కొడుతున్న 18 మంది కాంట్రాక్టు స్పెషలిస్ట్ వైద్యులను తొలగించనున్నారు. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వంటి స్పెషలిస్ట్ వైద్యులు, ఇతర వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. వీరిలో చాలామంది ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పని చేస్తున్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోజుకు రెండు గంటలు రోగులకు వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయితే వీరంతా ప్రైవేట్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో హాజరు వేసి వెళుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై మూడు నెలల క్రితమే పూర్తిస్థాయి పరిశీలన చేసిన జిల్లా అధికారులు అప్పటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా వైద్యులను విధులను నుంచి తొలగించాలని తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు రెండు రోజుల క్రితమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరాయి. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యను వివరణ కోరగా విధులకు సక్రమంగా హాజరు కాని ఎన్‌హెచ్‌ఎంలో 18 మంది కాంట్రాక్టు వైద్యులను ఈ నెలాఖరుకు విధుల నుంచి తొలగిస్తున్నామని నిర్ధారించారు.



హమ్మయ్య.. దాహం తీరింది!

మండుతున్న ఎండలకు ప్రజలే కాదు.. మూగప్రాణులూ అల్లాడిపోతున్నాయి. మండుతున్న ఎండలకు జలవనరుల్లో నీరు ఇంకిపోయాయి. తడారుతున్న గొంతును తడపుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాయి. మర్రిపాడు ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలో ఓ వానరం కొళాయి తిప్పుకుని మరీ దాహం తీర్చుకుంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- మర్రిపాడు

అక్కడ ముగ్గురు.. ఇక్కడ నలుగురు !

- ప్రభుత్వ పాఠశాలల్లో ఇదీ పరిస్థితి



ముగ్గురు పిల్లలతో నడుస్తున్న వెంకట్రావుపల్లి మెయిన్ పాఠశాల

ఉదయగిరి మండలంలోని కొండాయపాళెం పంచాయతీలోని వెంకట్రావుపల్లి మెయిన్, దళితవాడ ప్రాథమిక పాఠశాలల్లో వింత పరిస్థితి నెలకొంది. వెంకట్రావుపల్లి మెయిన్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు 1వ తరగతి, ఇద్దరు 2వ తరగతి చదువుతున్నారు. వీరికి ఓ ఉపాధ్యాయురాలు బోధిస్తోంది. అలాగే వెంక్రటావుపల్లి దళితవాడలో ఇద్దరు 1వ తరగతి, మరో ఇద్దరు 2వ తరగతిలో కొనసాగు తున్నారు. ఇక్కడ ఒక్క టీచరే ఉన్నారు. గతంలో ఈ పాఠశాలలో 1-5వ తరగతులు నిర్వహించేవారు. ప్రభు త్వం నూతన విద్యావిధానం అమల్లోకి తీసుకురావడంతో 3-5వ తరగతుల వరకు వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఈ పాఠశాలల్లో కేవలం ఒకట్రెండు తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల పిల్లల ఎవరూ లేకపోవడంతో ఉన్న పిల్లలతోనే పాఠశాలలు నడుస్తున్నాయి.

- ఉదయగిరి రూరల్



నలుగురు పిల్లలున్న వెంకట్రావుపల్లి దళితవాడ పాఠశాల



ఫిషింగ్‌హార్బర్‌లో సముద్రంలోకి వేసిన రోడ్డు



అర్థంతరంగా ఆగిన చేపలు నిల్వ చేసుకునే గోదాము

అదిగదిగో చిరకాల వాంఛ!

- నాటి ఎన్డీఏ కూటమిలో 'ఫిషింగ్ హార్బర్'కు బీజం
- వైసీపీ హయాంలో నత్తతోపోటీ పడేలా పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంపైనే ఆశలు
- పనులు పూర్తిచేస్తే మత్స్యకారులకు ఎంతో అనుకూలం
- ప్రత్యక్ష, పరోక్షంగా ఎందరికో ఉపాధి

కావలి, జూన్ 22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో బోగోలు మండలం జువ్వలదిన్నెలో రూపు దిద్దుకున్న ఫిషింగ్ హార్బర్ కోసం మత్స్యకారులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వం కేంద్రంలో బాగస్వామ్యంగా ఉన్నప్పుడు మత్స్య కారుల చిరకాల కోరిక అయిన ఫిషింగ్ హార్బర్‌ను జువ్వలదిన్నెలో మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో రూ.288 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. 1,250 బోట్ల సామర్థ్యంతో దానిని డిజైన్ చేశారు. అయితే, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గడిచిన ఐదేళ్ల కాలంలో కేవలం 70 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేయగా పాలకులు దానిని పూర్తి చేయించలేక పోయారు. అయితే హార్బర్‌ను తామే నిర్మించామని ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఈ ఏడాది ఆరంభంలో అప్పటి సీఎం జగన్ చేత వర్చువల్‌గా ప్రారంభించేం దుకు హడావుడి చేశారు. అయితే చివరి క్షణంలో కేంద్రం పనులు పూర్తి చేయకుండా ఎలా ప్రారంబిస్తారని హెచ్చరించడంతో సదరు కార్యక్రమాన్ని అర్థంతరంగా ఆపేశారు. పనులకు కూడా బ్రేకులు పడ్డాయి. కాగా, గతంలో ఎన్డీఏ ప్రభుత్వంలో హార్బర్ మంజూరు కావడం, ఇప్పుడు కూడా ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటంతో హార్బర్ నిర్మాణం పూర్తవుతుందనే గంజెడాశతో మత్స్యకారులు ఉన్నారు.

> **మంచి రోజులు దగ్గరలోనే..**
>
> కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రావటంతో జువ్వలదిన్నె హార్బర్‌లో పెండింగ్ పనులు త్వరలో పూర్తి అవుతాయి. పనులు పూర్తికాగానే ప్రారంభించి వినియోగంలోకి తెస్తాం. మత్స్యకారులకు మంచి రోజులు దగ్గరలోనే ఉన్నాయి.
>
> - శ్రీనివాసులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, కావలి



చేపలు ఆరబోసుకునే ప్లాట్‌ఫారాల దుస్థితి

● హార్బర్ వినియోగంలోకి వస్తే...

హార్బర్ పూర్తయితే మత్స్యకారుల మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభిస్తుంది. అంతేగాక ప్రత్యక్షంగా పరోక్షంగా అనేకమందికి ఉపాధి కలుగుతోంది. 1250 బోట్లు ఆగే విధంగా హార్బర్ నిర్మాణం జరగడంతో చేపల లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులకు ఉపాధి కలుగుతుంది. హార్బర్‌లోనే మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో అనేక కంపెనీలు క్రయ విక్రయాలు జరపడం ద్వారా మత్స్యకారులకే లాభం చేకూరుతుంది. అంతేగాక చిన్న చిన్న వ్యాపారులకూ మేలు జరుగుతుంది. సముద్రంలో ఎక్కడైనా బోట్లకు సాంకేతిక సమస్యలు వచ్చినపుడు వాటిని జువ్వలదిన్నె హార్బర్‌లో ల్యాండ్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

● పెండింగ్ పనులు ఇవే

హార్బర్‌కు అవసరమైన కోల్డ్‌స్టోరేజీ భవనం, చేపలు ఆరబోసుకునేందుకు ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. అలాగే, చేపలు నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాము కూడా లేదు. ఇక పడవలకు అవసరమైన పెట్రోల్, డీజిల్ కోసం ఓ బంకు నిర్మించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా, మంచినీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. జువ్వలదిన్నె నుంచి హార్బర్‌కు రాకపోకలు సాగించేందుకు బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న వంతెనను విస్తరించాల్సి ఉన్నా దానిని గత పాలకులు పట్టించుకోలేదు. అలాగే జాతీయరహదారి నుంచి ముంగమూరు మీదుగా ఫిషింగ్ హార్బర్‌కు రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డు నిర్మానానికి ప్రణాళికలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదు. నిర్మాణం పూర్తయిన భవనాల్లో వసతులు కల్పించాల్సి ఉంది. ఈ పనులన్నీ కొత్త ప్రభుత్వంలో పూర్తి చేసి మత్స్యకారులకు అందుబాటులోకి తెస్తే వారికి ఎంతో మేలు చేకూరుతోంది.

వరద కాలువ స్థలం ఆక్రమణ?

- ఇరిగేషన్ అధికారులకు ఆదురుపల్లి రైతుల ఫిర్యాదు
- పరిశీలనకే తప్ప సమస్య పరిష్కారం కాలేదని బాధితుల ఆరోపణ
- మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్తామంటున్న అన్నదాతలు

చేజర్ల, జూన్ 22: మండలంలోని చిత్తలూరు వరద కాలువను ఆక్రమించుకుని తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా ఓ బడా భూస్వామి చేశారని ఆదురుపల్లి రైతులు ఆరోపిస్తున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. తమ పొలాల సమీపంలో కొన్ని నెలల కిందట స్థానికంగా ఉన్న పొలాలను కొన్న బడా భూస్వామి ఆయన పొలానికి అనుకుని ఉన్న వరద కాలువను ఆక్రమించి సుమారు పది లక్షలకు పైగా విలువ చేసే స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. ఆక్రమించుకోవడమే కాకుండా కింది పొలాల రైతులకు దారిలో పోనివ్వకుండా చుట్టూ కంచె కూడా వేయిం చేశాడు. అప్పటి నుండి స్థానిక రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గ్రామస్థుల వరుస ఫిర్యాదు నేపథ్యంలో గతంలో అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి చర్యలు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో గ్రామస్థులు మరలా ఎక్కడ ఫిర్యాదు చేస్తారోమో అని ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. వారంరోజులు క్రితం ఆక్రమించిన స్థలాన్ని ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సురేష్ పరిశీలించి త్వరలో చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి కార్యరూపం మాత్రం దాల్చలేదు. సంఘ టనపై గ్రామ రైతులు మాట్లాడారు. తమ పొలాలకు వెళ్లాలంటే నానాతంటాలు పడాల్సి వస్తుందని, ఇరిగేషన్ ఏఈని అడిగితే ఈఈ మీద, ఈఈని అడిగితే ఏస్ఈ మీద అని ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కాలువ అంచున ఉండే కలపను కూడా వారు అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని చెబుతున్నారు. ఇదంతా కేవలం ఇరగేషన్ అధికారులు కనుసన్నల్లోనే జరిగిందని మండిపడుతున్నారు. ఈ దారి విషయంపై రెండురోజుల్లో ఆత్మకూరు శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదయ శాఖ మంత్రి ఆనం రాయనారాయనరెడ్డి దృష్టికి తీసుకవెళ్తామని గ్రామ రైతులు చెబుతున్నారు.



వరవ కాలువను ఆక్రమించి కంచె ఏర్పాటు చేసిన బడా భూస్వామి

పార్టీ కార్యాలయ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా!?

- వైసీపీ నేతలను నిలదీసిన కార్పొరేషన్ అధికారులు
- సమయం కావాలన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు
- అనుమతి పత్రాలతో రావాలని నోటీసులు

నెల్లూరు (వెంకటేశ్వర పురం), జూన్ 22 : నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు రెండెకరాల స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మిస్తుండగా, అనుమతుల విషయంపై కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడకు వెళ్లారు. విషయం తెలుసుకొన్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు ఖలీల్ తదితరులు అక్కడకు చేరు కోగా అనుమతి పత్రాలు చూపాలని అధికారులు వారిని కోరారు. కొంతసమయం కావాలని హఠాత్తుగా అడిగితే ఎలా వస్తాయని చంద్రశేఖర్‌రెడ్డి అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాసే పు వాదోపవాదనల అనంతరం నోటీసులను చంద్రశేఖరరెడ్డికి అందించి అధికారులు వెనుతిరి గారు. కాగా, వైసీపీ నాయకులు భారీగా అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

మనుబోలు, జూన్ 22: విద్యుదాఘాతంతో వివాహిత మృతిచెందిన సంఘటన స్థానిక కోదండరామపురంలోని దళితవాడలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దళితవాడలో కంట్లం కోటేశ్వరరావు, ఆయన భార్య హారిక (38) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం 11గంటలకు వంట చేసేందుకు హారిక మిక్సీవేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. భర్త కోటేశ్వరరావు హుటాహుటిన ఆమెను ఆటోలో సమీపం లో ఉన్న ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.



కంట్లం హారిక మృతదేహం

జమ్మలపాలెంలో హైడ్రామా

- ఫొటోల ఆవిష్కరణ విషయమ్మై సర్పంచి వర్సెస్ మాజీ సర్పంచిలు

జలదంకి, జూన్22: మండలంలోని జమ్మలపాలెం సచివాలయంలో శుక్రవారం హైడ్రామా చోటుచేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార సమయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేసే విషయంలో సర్పంచి బుర్రి శ్రీవేణి, మాజీసర్పంచి నక్కా మాధవరావు మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. వైసీపీకి మద్దతుదారు అయిన సర్పంచి శ్రీవేణికి చిత్రపటాలను ఏర్పాటు చేసే అర్హత లేదని, ఆమె ఏర్పాటు చేసిన ఫొటోలు తీసేసి తాము తెచ్చిన చంద్రబాబు, పవన్ చిత్రపటాలను సచివాలయంలో కూటమి నేతలు ఏర్పాటు చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. గ్రామస్థులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మాజీ సర్పంచి నక్కా మాధవరావు పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణారెడ్డితో మాట్లాడుతూ సచివాలయం తాళాలు సర్పంచి వద్ద ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. తక్షణమే తాళాలు స్వాధీనం చేసుకుని మీ వద్ద ఉంచుకోవాలని కోరారు. తాళాలు స్వాధీనం చేసుకుంటానని కార్యదర్శి చెప్పడంతో కూటమి నాయకులు శాంతించారు. ఇంతలో సచివాయలంలోనే ఉన్న సర్పంచి శ్రీవేణి మాజీసర్పంచి మాధవరావును ఏకవచనంతో సం బోధించారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న సచివాలయం సిబ్బంది కూటమి నేతలకు సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు. ఈ విషయం శనివారం మండలంలో తీవ్రచర్చనీయాంశమైంది.



జమ్మలపాలెం సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను ఏర్పాటు చేసి హర్షం వ్యక్తం చేస్తున్న కూటమి నాయకులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6824
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 93.30

సోమశిలలో 10.040 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 22: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 929 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 10.040 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

వేదగిరిపై గిరిప్రదక్షిణ

నెల్లూరురూరల్, జూన్ 22 : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహుడి గిరిప్రదక్షిణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, అధికారులు వేదగిరి గిరీశుడిని ముస్తాబు చేసి పల్లకిపై కొలువు దీర్చి వేద పండితులు మంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గిరిప్రదక్షణ కనుల పండుగగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.



గిరిప్రదక్షిణకు ముస్తాబైన వేదగిరీశుడు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం

నెల్లూరు(వైద్యం), జూన్ 22 : జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, మండల వైద్యాధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో డయేరియాపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ వ్యాధి నియంత్రణకు ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. డయేరియాతో ఎవరూ మరణించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితమైన ప్రాంతాల్లో ప్రజలు ఆ నీటిని వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ అధికారులు తాగునీటి పథకాలను పరిశీలించాలని పేర్కొన్నారు. 5 ఏళ్ల లోపు చిన్నారులు డయేరియాకు గురికాకుండా జాగ్రత్తలు ఈసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఇంటింటికి వెళ్లి అంటువ్యాధులపై అవగామన కల్పించాలని కోరారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నీటి నమూనాలను పరీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత పాల్గొన్నారు.



అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



శనివారం రాత్రి కురిసిన చిరుజల్లులకు రోడ్డుపై కాంతులీనుతున్న సెంట్రల్ లైటింగ్‌తో చూపరులను ఆకట్టుకున్న కావలిలోని కావలి - ఉదయగిరి రహదారి

- జలదంకి

లాభాల బాటలో కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు

- మహాజన సభలో సీఈవో అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 22 : తమ బ్యాంకు లాబాల బాటలో నడుస్తోందని ది నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ సీఈవో అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. శనివారం నెల్లూరు టౌన్‌హాల్లో ఆ బ్యాంకు మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రసాయి మాట్లాడుతూ 107 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన తమ బ్యాంకు ద్వారా నెల్లూరు నగరంలోని పేద, మధ్యతరగతి వారికి అతి తక్కువ వడ్డీకి రుణాలు అందచేస్తున్నామని చెప్పారు. కేంద్రప్రభుత్వం సహకార బ్యాంకుల ఆదాయంపై పన్ను విధించటం వలన పెద్ద భారంగా మారిందన్నారు. అయినప్పటికీ రూ.69 లక్షల నికర ఆదాయంతో డివిడెండ్ చెల్లించడానికి సిద్ధమైందన్నారు. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఎన్‌పీఏ 6.8 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గించామని, 70 శాతం వరకు రుణాలు పంపిణీ చేశామన్నారు. ఐదేళ్ల పాటు ఆర్‌డీ కట్టుకుంటే పిల్లల చదువులకు, ఇతర ఖర్చులకు ఆ మొత్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బంగారంపై, ఎంఎస్ఎంఈ, ఇతర రుణాలు సకాలంలో ఇస్తున్నామని చెప్పారు. అనంతరం 10వ తరగతిలో 500లకు పైబడి మార్కులు సాధించిన బ్యాంకు ఖాతాదారుల పిల్లలలకు ఒక్కొక్కరికి రూ.5వేల ప్రోత్సాహక బహుమతి అందచేశారు. రుణాలు సక్రమంగా చెల్లించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంకు సీఈవో అనిత, వైస్ చైర్మన్ నలగండ్ల శ్రీనాథం, డైరెక్టర్లు వినోదిని, మహేశ్వరి, జయకోటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, అమర్‌ఖాసిం, నాగలక్ష్మి, లతీఫ్ అహ్మద్, కనుపర్తి శ్రీనివాసమూర్తి, మెన్నం జీవన్‌శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు సీఈవో అరిగెల నాగేంద్రసాయి

ఇసుక, గ్రావెల్, కంకర అక్రమ నిల్వలపై మైనింగ్ అధికారుల దాడులు

కొడవలూరు, జూన్ 22 : మండలంలో పెయ్యలపాళెం గ్రామంలో గ్రావెల్, ఇసుక, కంకర అక్రమ నిల్వలపై మైనింగ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఇసుక, గ్రావెల్, నానిరకం కంకర నిల్వ ఉంచిన యార్డును సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. యార్డులో ఉన్న జేసీబీని స్థానిక పోలిసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



సంగం, జూన్ 22: పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ డీఈవో గోపాల్ ఆదేశించారు. శనివారం గాంధీజన సంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అదనపు తరగతి గదులతో పాటు వం టగది, మరుగుదొడ్ల, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసి ఐఎఫ్ఈ ప్యానల్‌ను విని యోగంలోకి తేవాలని హెచ్ఎం మల్లికార్జునరెడ్డికి సూచించారు.

నెమళ్లదిన్నెలో 'నేను బడికి పోతా'

సీతారామపురం, జూన్ 22: నెమళ్లదిన్నెలో 'నేను బడికి పోతా'లో భాగంగా శనివారం ఎంఈఓ మస్తాన్‌వలి, సర్పంచ్ రామచంద్ర, హెచ్ఎం బాలకృష్ణ అన్వేష్ కుమార్ 6వ తరగతి విద్యార్థిని స్కూల్‌లో చేర్పించారు.

వైభవంగా ఆత్మారామస్వామి రథోత్సవం



నందీశ్వరుడిపై స్వామి, అమ్మవారు

సంగం, జూన్ 22: అన్నారెడ్డిపాళెం ఆత్మారామస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. వేడుకలో పులగం కృష్ణారెడ్డి, మన్నెమాల మధుసూదన్‌రెడ్డి సన్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే దువ్వూరు కోటేశ్వరస్వామి శనివారం తెల్లవారుజామున నందీశ్వరునిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి శివకుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమతం బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే తరుణవాయి కోదండరామస్వామి కల్యాణం శుక్రవారం అర్థ రాత్రి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కలువాయి: కుల్లూరు శ్రీదేవి, భూదేవి సమేత అచ్యుతస్వామి కల్యాణంను వేదపండితులు నిర్వహించారు. ఉభయకర్తలుగా మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు వ్యవహరించారు. రాత్రికి గజవాహనసేవ నిర్వహించారు.

ఉదయగిరి రూరల్: గంగిరెడ్డిపల్లిలో గంగాభవాని ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీసీతారాముల కల్యాణంను నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివార్లకు గణపతి పూజ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని కనులారా తిలకించారు. రాత్రికి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం



దాచూరు సర్పంచు, ఉప సర్పంచులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, జూన్ 22: మండలకేంద్రంలో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు దాచూరు సర్పంచు రాజుల అనురాధ, వైస్ సర్పంచు వీ.శ్రీని వాసులు, మండల పార్టీ ఇన్‌చార్జ్ మోహన్‌రావు, తెలుగురాయపురం నాయ కులు రాంనారాయణరెడ్డి, బి.నారాయణరెడ్డి, విజయ కుమార్‌రెడ్డిలను సన్మానిం చారు. సమావేశంలో చల్లా శ్రీనివాసులరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి : డీపీఓ

అనంతసాగరం, జూన్ 22: గ్రామీణప్రాంతాల్లోని తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితరెడ్డి తెలిపారు. శనివారం అనంతసాగరం గుంతబజారు సమీపంలోని తాగునీటి బావిని జెడ్పీ సీఈవో కన్నమ్మనాయుడుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ బావిలో కలుషిత జలాలు కలుస్తున్నాయని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరు గారికి స్థానిక వైద్యులు తెలపడంతో కలెక్టరు ఆదేశాలతో పరిశీలనకు వచ్చామని, బ్యాక్టీరియల్ టెస్టుకు బావి నీరు పంపిస్తామన్నారు. అధికారుల రాకను తెలుసుకున్న గ్రామస్థులు బావి దగ్గరకు పెద్దఎత్తున చేరుకున్నారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ బావి నీరు ఎంతో సురక్షితమని.. తాము ఇప్పటికీ ఈనీరే తాగుతున్నామని ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ ఉన్నారు.

వచ్చే నెల నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

కలువాయి, జూన్ 22: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మొత్తం పెంచుతూ జూలై నుంచి పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వం జీవో 43జారీ చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. శనివారం మండల కార్యాయలంలో ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కలువాయి విద్యుత్ సబ్‌స్టేషన్ సబ్ ఇంజనీర్ యశ్వంత్‌కు సంతాపంగా సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు. వివిధశాఖల పరిధిలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై సమీక్ష

ఉదయగిరి, జూన్ 22: డయేరియా నివారణ మాసోత్సవాలపై కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విద్యా, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ జులై 1 నుంచి 30వ తేదీ వరకు జరిగే డయేరియా నివారణ మాసోత్సవాలపై తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలు తయారు చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహానాయక్, ఈవోపీఆర్డీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

వరికుంటపాడు, జూన్ 22: తూర్పుచెన్నంపల్లి పాఠశాల విద్యార్థులకు శనివారం గడిపూటి కొండయ్య దంపతులు విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు షావుద్దీన్, రమణయ్య పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన అధికారులను సన్మానించారు. హెచ్ఎం శోభన్‌బాబు, ఆదర్శ్ సేవాసంస్థ అధ్యక్షుడు బక్కా ఆదెయ్య, లార్డ్‌సంస్థ ప్రతినిధి ఏలియా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆత్మకూరు: చెర్లోయడవల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నిరు. వైద్యురాలు ప్రమీల మాదమాల 150 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆలంబన ఫౌండేష్ - ఇండియా నిర్వాహకులు షుగర్, బీపీ రోగులకు మూడు నెలల మందులు అందజేశారు.

బాలకార్మిక చట్టాలపై అవగాహన

ఉదయగిరి, జూన్ 22: కార్మికశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయగిరిలో బాలకార్మికుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ అధికారి హరిబాబు మాట్లాడారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో చేర్చుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం యజమానులు శిక్షార్హులన్నారు. ఓ దుకాణంలో బాల కార్మికుడిని గుర్తించి యజమానికి ఆదేశాలు జారీ చేశారు. బాలకార్మికులు ఉంటే సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖాధికారులు వెంకటేశ్వర్లు, శైలజ, సతీష్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతి

కావలి,జూన్ 22: పట్టణంలోని అమృత్ పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ కోరారు. శనివారం ఆయన స్థానిక బీజేపీ నేతలతో కలిసి డీఎస్పీ ఎం. వెంకటరమణకు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ఆయన పైలాన్ ధ్వంసం విషయమై సాక్షి విలేకరి కే. శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అప్పటి డీఎస్పీ డీ. ప్రసాద్, మున్సిపల్ అధికారులను విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కే. బ్రహ్మానందం, మద్దిశెట్టి నరేంద్ర, మందా కిరణ్, కూరాకుల సవీంద్ర, కే మాధవరావు, సుందరశెట్టి సుజీ,టీ శివ, జీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

అల్లూరు, జూన్ 22 : తాజాగా ప్రబలుతున్న డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. అల్లూరు ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. ముందుగా కలెక్టరు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో తాగునీటిని ప్రతిరోజూ పరీక్షించడం, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ ఫణికుమార్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఆచారాలను పాటిద్దాం..

కలిగిరి : స్థానిక షిర్డీసాయిరాం డిగ్రీ కాలేజీలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మప్రచారక్ కర్రా భాస్కర్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయ ఆచారవ్యవహారాలను ప్రతి కుటుంబం పాటించాలన్నారు. ధర్మప్రచారక్ సభ్యులు పట్టణంలో ఇంటింటి తిరిగి ధర్మ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహమహిళా కన్వీనర్ అంజమ్మ, ధర్మప్రచారక్ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయండి

కావలిటౌన్ : ఏపీ కన్జూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఏపీసీఆర్‌పీఎఫ్)సభ్యులు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఏపీసీ ఆర్‌పీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగళ్ల ఉదయ్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో రాష్ట్ర ఈసీమెంబర్ బీ మమూల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఫోరం సభ్యులు ఆసుపత్రులు, పాఠశాలలు, హోటళ్లను సందర్శించి, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా కన్వీనర్ బుజ్జయ్య, అవినాష్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విచారణ లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు

బిట్రగుంట : స్థానికంగా విచారణ జరపకుండా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం సరికాదని ఏపీ ఎరుకుల హక్కుల సేవా సంఘం నాయకుడు నల్లగుండ శివ అన్నారు. బోగోలు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటరత్నం శనివారం విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టరుతోపాటు రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి గుర్రంకొండ సుమతి, ఎరుకుల నేతలు బోగిరి యోహాను, దాసరి పోలయ్యలు ఎరుకుల కులానికి సంబంధించిన పత్రాలను తహసీల్దారు అందచేశారు. అయితే ఎస్టీగా రైల్వే ఉద్యోగం చేస్తున్న పీట్ల ధనమ్మకు నోటీసు పంపినా, ఆమె హాజరు కాలేదని తహసీల్దారు తెలిపారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన తరువాత నివేదికను కలెక్టరుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘాల నేతలు గుత్తి సుధాకర్, బచ్చు నిరంజన్, భాగి రాజేష్, మిట ప్రతాప్, దేవరకొండ వరుణ్, ఆవుల అరుణ్ పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట : బోగోలు మండలం కొత్తూరు గ్రామ శివాల్లో ఉన్న నాగవరపమ్మ ఆలయంలో జేష్టపౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేదపండితులు వరహాచల సాయిరామాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మహిళలు పొంగళ్లను తీసుకువచ్చి అమ్మవారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం భజనలు చేశారు

చెన్నాయపాలెంలో 'నేను బడికి పోతా'

కావలి రూరల్ : పిల్లల చదువు వారి భవితకు వెలుగని ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. కావలి మండలం చెన్నాయపాలెం ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం జీవీ రంగాచార్యులు ఆధ్వర్యంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర

● సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి సంఘీభావం

వెంకటాచలం, జూన్ 22: సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ 100 మందితో కలిసి పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. వేకువజామున అనికేపల్లి నుండి ప్రారంభమైన పాద యాత్ర గొలగమూడి, కంటేపల్లి, జాతీయ రహదారి వెంబడి సాగి శని వారం రాత్రికి గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరుకు చేరుకుంది. పాదయాత్రకు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డి సంఘీభావం తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పీ శ్రీహరి, టీడీపీ జిల్లా నాయకుడు పొన్నూరు రామకృష్ణయ్య, పాదయాత్ర సాగిన గ్రామాల వెంబడి ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు పాదయాత్రకు మద్దతు తెలిపారు. పాదయాత్ర వెంట కలిసి నడిచారు.

రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చింది : బొమ్మి

మనుబోలు: రాష్ట్రంలో ఎట్టకేలకు రాక్షసపాలన పోయి రామరాజ్యం వచ్చిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర అన్నారు. వెంకటాచలం టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన తిరుమల పాదయాత్ర శనివారం మనుబోలు చేరుకుంది. బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్యలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎంగా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర చేపట్టామన్నారు. 50మంది పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు టీడీపీ నాయకులు చింతల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి

ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం ఫొటోల ఏర్పాటు

మనుబోలు, జూన్ 22: మండల కేంద్రమైన మనుబోలులోని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం జనసైనికులు డిప్యూటీ సీఎం కే పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటుచేశారు. తహసీల్దార్, మండలపరిషత్, పంచాయతీ, పోలీస్‌స్టేషన్, సచివాలయాలలో డిప్యూటీ సీఎం చిత్రపటాలను సీఎం చంద్రబాబు నాయుడు ఫోటో పక్కనే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పవన్, జాకీర్, ఖాదర్‌వల్లీ, సురేష్, కోటేశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రావుల జితేంద్ర గౌడ్, ప్రసాద్ గౌడ్, బండికట్టు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం జనసైనికులు స్థానిక అంబేడ్కర్ నగర్ నుంచి గొలగమూడి వెంకయ్య స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, మానుగుంట సుధాకర్‌రెడ్డి, రావుల అంకయ్య గౌడ్‌లు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటం ఏర్పాటు చేస్తున్న జనసైనికులు

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

తోటపల్లిగూడూరు, జూన్ 22: ప్రభుత్వం చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా చెన్నపల్లిపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మహాలక్ష్మీపురం సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఫణికుమార్, విద్యాధరి, రమణ ప్రసాద్, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 22: ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణ్‌లాల్(20) కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చారు. టైల్స్ పనులు చేసుకుంటూ మాగుంటలేవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇటీవలే వివాహం అయ్యింది. ఈ క్రమంలో తాను ఉంటున్న గదిలోనే శుక్రవారం ఫ్యానుకు ఉరివేసుకుని లక్ష్మణ్‌లాల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో శనివారం రాత్రి వారు నెల్లూరుకు చేరుకొని లక్ష్మణ్‌లాల్ మృతదేహాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఆత్మహత్యపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

విడవలూరు, జూన్ 22: రామతీర్థం గ్రామంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. ఈనెల 27 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అన్ని శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని, అందుకు అణుగుణంగా పోలీసులు, రెవెన్యూ, వైద్యాధికారులు, దేవాదాయ శాఖ, గ్రామపెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు స్నానాల గదులు, తాగునీరు, భోజన వసతులు కల్పించాలన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని, విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం

పొదలకూరు, జూన్ 22 : ప్రజాసమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం అని నేతలు పేర్కొన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత, యూత్ నాయకులతో మండల అధ్యక్షుడు తల చీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తాగు నీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిలైట్లు సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూస్తామని, పిల్లలకు అవసరమైన సర్టిఫికెట్లను కూడా అధికారులు వెంటనే ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకులు కలగట్ల సందీప్, మల్లినేని వెంకటేష్ నాయుడు, ఆదాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే విధ్వంసాలు : టీడీపీ

తోటపల్లిగూడూరు, జూన్ 22: వైసీపీ పాలనలోనే విధ్వంసాలు జరిగాయని, వాటి గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లేదని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు వీరబోయిన గంగాధర్ అన్నారు. కోడూరులో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియేటర్లు విధ్వంసం టీడీపీ నేతలు చేయలేదని, దానిపై విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు ఊటుకూరు శ్రీనివాసులు, ఆవుల మునిరత్నం, కైలాసం రాజబాబు, పామంజి దొరబాబు, ఊటుకూరు అవినాష్ పాల్గొన్నారు.







ప్రశాంతిరెడ్డితోనే అవినీతి రహిత పాలన

కొడవలూరు, జూన్ 22 : అవినీతి రహిత పాలన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు పందిటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పెయ్యలపాళెంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాలకు పెయ్యలపాళెంను అడ్డాగా మార్చేశారని, ఇక అక్రమాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలో దళితులను భయభ్రాంతులకు గురిచేసి వారి భూములను అక్రమించి 40 అడుగుల గుంతలు తవ్వి గ్రావెల్ తరలించి దోచుకున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.9.5 లక్షల వసూలు

● కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం): ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.9.5 లక్షలు తీసుకొని మోసం చేశాడని 37వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్‌పై శనివారం దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ 37వ డివిజన్‌లో నివాసం ఉండే జగ్గారావుకు విద్యుత్ శాఖలో లైన్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.3.50 లక్షల తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించక పోవడంతో తన వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని కార్పొరేటర్‌ను కోరితే చంపేస్తానని బెదిరించారని, తన తల్లి అనారోగ్యంతో ఉందని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నవాబుపేటకు చెందిన అవినాష్ దర్గామిట్ట సరస్వతి నగర్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షిఫ్ట్ ఆపరేటర్ పోస్టు రాకముందు తన మిత్రుడు జగ్గారావు ద్వారా కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌ను కలవగా లైన్‌మెన్ పోస్టు ఇప్పిస్తానని రూ.6లక్షలు తీసుకున్నాడని, నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించలేదని, తాను ఇచ్చిన నగదు ఇవ్వమంటే బెదిరిస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

ఆ చట్టాలు అమలయితే దేశానికి ప్రమాదం

● కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్

నెల్లూరు (సాంస్కృతికం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరిస్తూ భారత నేర శిక్షాస్మృతి చట్టాలను చేసిందని, ఆ చట్టాలు జూలై నుంచి అమలులోకి వస్తే దేశం ప్రమాదంలో పడనున్నదని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చదువులేని ప్రధాని నరేంద్రమోదీ, తలకాయలేని అమిత్‌షా ఈ చట్టాలను తీసుకువచ్చారని తెలిపారు. నూతనంగా చేసిన నేర శిక్షాస్మృతి చట్టాల వల్ల న్యాయ వ్యవస్థ కుప్పకూలిపోతుందన్నారు. ఈ చట్టాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులే బాధపడుతున్నారని తెలిపారు. ఈ మూడు చట్టాల వల్ల భారత రాజ్యాంగం బలహీనపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు, న్యాయవ్యవస్థకు అన్నింటికి ఇబ్బందికరమైన ఆ మూడు చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ చట్టాలను ఖండించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నదని ఆయన తెలిపారు. నేడు విద్యారంగం భ్రష్టు పట్టిందన్నారు. నీట్ పేపర్లు లీక్ కావడంతో లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జగన్ ప్రజలను ఒక్కచాన్స్ అడిగారు.. ఆ ఒక్కచాన్సు ఇచ్చారు. ఏమైందో మనందరికి తెలిసిందేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వం బాగుంటుందని ప్రజలతోపాటు తాను భావిస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

నారాయణలో జాతీయస్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో

నెల్లూరు(విద్య), జూన్ 22 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ వై.విజయన్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఎక్స్‌పోకు హాజరైన బీటెక్ విద్యార్థులు సమాజానికి ఉపయుక్తమైన సాంకేతిక అంశాలైన రోబోట్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్స్, హైబ్రీడ్ వెహికల్స్, ఎలక్ట్రికల్ వెహికల్స్ తదితర ప్రాజెక్ట్‌లను తయారు చేయడం అభినందనీయమన్నారు. తమలోని ఆలోచనా శక్తిని ఇలానే కొనసాగించి దేశానికి ఉపయోగపడేలా సంసిద్ధం కావాలని తెలిపారు. ట్రాన్స్‌కో ఈఈ ఎస్.బాలచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనాశక్తితో టెక్నాలజీ ఉపయోగించి సమాజానికి ఉపయోగపడేలా ప్రాజెక్ట్ తయారు చేశారన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం పలు ప్రాజెక్ట్‌లను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ బీ.దత్తాత్రేయశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌పో ప్రారంభిస్తున్న అధికారులు

వీఎస్‌యూ అథ్లెటిక్స్ ఛాంపియన్ డీకేడబ్ల్యూ జట్టు

నెల్లూరు(విద్య), జూన్ 22 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌ను నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం యూనివర్శిటీలో ఉపకులపతి ఆచార్య సుందరవల్లి నుంచి రూ.50వేల, షీల్డ్‌ను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి తెలిపారు. అలాగే కళాశాలకు చెందిన ఎం.సుప్రియ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సాధించి రూ.5వేల, అనూహ్య, కె.అనూష, ఎం.సుప్రియలు రూ.3వేలు చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరిన్ని విజయాలు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీ.విజయకళ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపకులపతి

కొండాయపాళెం పాఠశాలలో వేడుకలు

నెల్లూరు(విద్య), జూన్ 22 : నేడు బడికిపోతా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల 105 సంవత్సరాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య జి.సుందరవల్లి మాట్లాడుతూ పిల్లలు విద్యలో రాణించాలన్నా, వ్యక్తిత్వ వికాసం పెరగాలన్నా అది పాఠశాలలోనే సాధ్యమన్నారు. చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తిని పెంపొందించి ఆనందంగా బడికి హాజరయ్యేలా సంసిద్ధం చేయాలన్నారు. విద్యార్థులను తమకు అనుకూలంగా మలచుకోవడంతో పాటు ఉత్తమంగా తీర్చిదిద్దగలిగేది ఒక్క గురువేనని, ప్రతి ఒక్కరూ గురువుకు ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తించి గౌరవించాలన్నారు. కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, దాతలు సహకరించడంతో పాఠశాల ఉత్తమంగా గుర్తింపు పొందుతోందన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కర్‌రావు పాఠశాల ఉన్నతికి ఎంతో కృషి చేశారని, ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరింతమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు వీపీఆర్ విద్యా సంస్థలో సీట్లు సాధించడంతో వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ ఉషాకిరణ్, ఎస్ఎస్ఏ ఏఎంవో జి.సుధీర్‌బాబు, డిప్యూటీ ఈవో కె.ప్రసన్నలక్ష్మి, డాక్టర్ కె.సునీత, ఎంఈవోలు అబ్దుల్‌హమీద్, మురళీధర్, బీటీఏ నేతలు మాసా ప్రసాద్, వేణుగోపాల్, ఆదినారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 22: నగరంలోని బర్మాషెల్ గుంటలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ బాధితులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. జనసేన పార్టీ నాయకులు శ్రీరామ్, నాగరత్నం, వై రవికుమార్, మేకల ప్రసాద్ యాదవ్, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

జనసేన పార్టీ నాయకులు, పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం రాష్ట్ర నాయకుడు టోనీబాబు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో నిరాశ్రులైన బాధితులకు చీరలు, దుప్పట్లు, భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, ప్రశాంత్, నవీన్, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, పండ్లు..

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని బర్మాషెల్ గుంట అగ్ని ప్రమాద బాధితులకు విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కళ్యాణి దూబిశెట్టి, సభ్యులు హసేన్, సుభాషిణి, చరిత, ధనలక్ష్మి, రాము, లక్ష్మి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ప్రసాద్‌చౌదరిపై దాడి ?

● వైసీపీ నేత ఆదాల నివాసం వద్ద ఉద్రిక్తత

నెల్లూరురూరల్, జూన్ 22 : నెల్లూరు మాజీ ఎంపీ, వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసం వద్ద శనివారం ఓ ప్రముఖ కాంట్రాక్టర్ ప్రసాద్‌చౌదరిపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల మేరకు.. ప్రముఖ కాంట్రాక్టర్ ప్రసాద్ చౌదరి ఆదాలతో కాంట్రాక్టు పనుల్లో భాగస్వామ్యంగా ఉన్నట్లు తెలిసిం ది. ఈ నేపథ్యంలో వారిరువురి మధ్య సుమారు రూ.9 కోట్ల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కొంత విభేదాలు నడుస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తన కు రావాల్సిన డబ్బులు అడిగేందుకు ఆయన నగరం లోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న ఆదాల నివాసానికి వెళ్లారు. డబ్బుల విషయమై చర్చిస్తున్న నేపథ్యంలో అక్కడ ప్రతికూల పరిస్థితులు ఏర్పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాల ఇంటి వద్ద నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులు కొందరు కాంట్రాక్టర్ ప్రసాద్ చౌదరిపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనకు సంబంధించి ప్రసాద్‌చౌదరిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆదాల ఇంటి వద్ద దాడికి పాల్పడుతున్న వైసీపీ శ్రేణులు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 22 : జేష్ఠ పౌర్ణమి సందర్భంగా నగరంలోని మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో నివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారికి పల్లకీసేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలకు శాశ్విత ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి దంపతులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు చిత్తూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, ఆలయ అర్చకులు బి.శ్రీనివాసులుస్వామి పర్యవేక్షించారు.



గాంధీనగర్ కృష్ణమందిరంలో పూజలందుకున్న సత్యనారాయణస్వామి

గరుడ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 22 : నగరంలోని మాగుంట లేఅవుట్ గోదా పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడవాహనంపై గ్రామ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నిత్య హోమం, బలిహరణం, మంగళ శాస నం, శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీవారికి సప్తదశ కలిశ స్నపన తిరుమంజనం, మంగళశాసనాలు, తీర్థప్రసాద ఘోష్టిలు జరిగాయి. సాయంత్రం గోదా పద్మావతి ప్రసన్న వెంకటేశ్వరస్వామిలకు కల్యాణం వైభవంగా జరిగింది. నిత్యహోమం, బలిహరణం, మంగళ శాసనాలు జరిగాయి. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల గోవింద నామ స్మరణలు మారుమోగాయి.



కల్యాణ వేదికపై వేంకటేశ్వరస్వామి

మానసిన దివ్యాంగులకు అన్నదానం

నెల్లూరు(వైద్యం), జూన్ 22 : నగరంలోని ప్రగతి ఛారిటబుల్ ట్రస్ట్‌లో శనివారం 150 మంది మానసిన దివ్యాంగులు, అనాథలకు విశ్వబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వబంధు ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు శీలం తిరుపతయ్య మాట్లాడుతూ మానసిక, అనాథ పిల్లలకు అన్నదానంతో పాటు పలు, ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ రామచంద్రయ్య, చందన్‌కుమార్, సంజయ్ పాల్గొన్నారు.

జాషువా గ్రంథాలయ కమిటీకి ఆహ్వానం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 22 : నగరంలోని మద్రాసుబస్టాండ్ పాత జూబ్లీ ఆసుపత్రిలోని గుర్రం జాషువా గ్రంథాలయం పునఃనిర్మాణ పనులు సమీక్షించేందుకు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ గ్రంథాలయ కమిటీకి ఆహ్వానం పలికారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 4గంటలకు కమిషనర్ కార్యాలయానికి రావాలని ఆహ్వానించినట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

టైలర్స్ కాలనీలో 'నేను బడికి పోతా' ర్యాలీ

నెల్లూరురూరల్, జూన్ 22 : నెల్లూరురూరల్ పరిధిలోని టైలర్స్ కాలనీ వద్ద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యాశాఖ అధికారులు శనివారం నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో-1, ఎంఈవో-2లు బిక్షాలు, మురళీధర్‌లు పాల్గొని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలలో ఉండాలని స్పష్టం చేశారు. అందుకు పిల్లల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని చెప్పారు. చదువుతోనే సమాజ మార్పు వస్తుందని అందరూ గ్రహించాలని కోరారు. ఐదేళ్ల నిండిన ప్రతి పిల్లవాడు పాఠశాలకు వెళ్లాలని, అందుకు స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వినూత్నంగా తీసుకువచ్చిన నేను బడికిపోతా కార్యక్రమాన్ని అందరు విజయవంతం చేయాలన్నారు.

నాట్య నీరాజనం



తిరుపతికి చెందిన సిటీజన్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త నిర్వహణలో శనివారం మహతి కళావేదికలో జరిగిన అయోధ్య రాముడికి నాట్యనీరాజనం కార్యక్రమం కళాభిమానులను అలరించింది. చిన్నారులు మొదలుకుని పెద్దలవరకు నృత్య కళాకారులు జానపద, సంప్రదాయ ప్రదర్శనలిచ్చారు. ఆదివారం కూడా ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నాట్యనీరాజనం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎం.జి.బాలాజి, కోలా వెంకటేశ్వరరావు తెలిపారు.

- తిరుపతి కల్చరల్



గరుడుడిపై గోవిందుడు

తిరుమల క్షేత్రంలో శనివారం పౌర్ణమి గరుడసేవ కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక ఆభరణాలు, పుష్పాలంకరణలో మలయప్పస్వామిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి వాహనమండపంలో సిద్ధం చేసిన గరుడ వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మలయప్పస్వామి గరుడుడిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



గోపూజలో హోంమంత్రి

శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం రాత్రి తిరుమలకొచ్చారు. అంతకుముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరానికి వెళ్లిన ఆమె వేణుగోపాలస్వామిని దర్శించుకుని గోపూజలో పాల్గొన్నారు. తర్వాత గోవులకు గ్రాసం అందించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ సంప్రదాయబద్ధంగా గోపూజ చేయడం చాలా సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పాపం పోలీసులు!

సిబ్బంది తక్కువ....
పనిభారం ఎక్కువ

డబుల్ డ్యూటీలతో విసిగిపోతున్న వైనం

రెండేళ్లుగా పెరిగిపోతున్న ఆన్‌లైన్ నేరాలు



తిరుపతి(నేరవిభాగం), జూన్ 22 : పోలీసులపై రోజురోజుకూ పనిభారం పెరిగిపోతోంది. సిబ్బంది లేమితో షిఫ్టుల మీద షిఫ్టులు డ్యూటీ వేస్తుండడంతో పని భారం మోయలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో వున్న సిబ్బందిపైనే పనిభారం పెరుగుతోంది. రాష్ట్రంలో తిరుపతి పోలీసు జిల్లా అతి పెద్దది కావడమే కాక వీవీఐపీల తాకిడి కూడా ఎక్కువగా వున్న ప్రాంతమిది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వీఐపీలు ఎక్కువగా వస్తుంటారు. తిరుపతి జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది సబ్ డివిజన్లు, 10 సర్కిళ్ళు, 54 పోలీసు స్టేషన్లు వున్నాయి. ఎస్పీ నేతృత్వంలో నలుగురు అదనపు ఎస్పీలు, 10మంది డీఎస్పీలు, 50మంది సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, దాదాపు 70మంది ఎస్‌ఐలు, 100 మంది ఏఎస్‌ఐలు, 200 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు, 2000 మంది కానిస్టేబుళ్ళు, 1000 మంది హోంగార్డులు ఇక్కడ పనిచేయాల్సి వుండగా తిరుమల ఏఎస్పీ పోస్టు ఖాళీగా వుంది.దీంతో అక్కడ జరుగుతున్న నేరాలు, టీటీడీతో సమన్వయం చేయడం తదితరాల్లో సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది.తిరుమల క్రైం, ట్రాఫిక్, శాంతి భద్రతల స్టేషన్లను సిబ్బంది కొరత పీడిస్తోంది. ఒక్కో స్టేషన్‌కు సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు ఏఎస్‌ఐలు, కనీసం 25 మంది సిబ్బంది అవసరముంది.అయితే సిబ్బంది తక్కువుండడంతో డబుల్ డ్యూటీలు చేయలేక అల్లాడిపోతున్నారు.ప్రస్తుతం తిరుపతి క్రైం ఏఎస్పీని తిరుమలకు ఇన్‌చార్జిగా నియమించారు.తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు డీఎస్పీ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇక్కడ కూడా తాత్కాలికంగా రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సులో డీఎస్పీగా వున్న రవికుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. చంద్రగిరి డీఎస్పీ పోస్టు ఖాళీగా వుంది.ఎస్పీ కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీల్లో ఒకరిని ట్రాఫిక్‌కు, మరొకరిని దిశ పోలీసు స్టేషన్లకు ఇన్‌చార్జిలుగా నియమించారు.దీంతో శాంతి భద్రతల పర్యవేక్షణ కొరవడింది.తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, తిరుమల, తిరుపతి క్రైం, దిశ, ట్రాఫిక్ వంటి స్టేషన్లకు కనీసం 30 మంది సిబ్బంది అవసరం వుంది. ఈస్ట్ స్టేషన్‌లో 10 పోస్టులు ఖాళీగా వున్నాయి. అలిపిరి స్టేషన్‌లో ఇద్దరు ఏఎస్‌ఐలు, మరో 10 మంది కానిస్టేబుళ్ళ పోస్టులు భర్తీ చేయాల్సి వుంది. పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు 100మంది కానిస్టేబుళ్ళను లేకుంటే హోంగార్డులను అయినా నియమించాల్సి వుంది. మరోవైపు కోర్టు డ్యూటీలు, సమన్లు సర్వ్ చేయడం, బీట్ కానిస్టేబుళ్ళు, రక్షక్, బ్లూకోల్ట్స్, మొబైల్ పార్టీలు వున్నా ప్రతి విభాగంలో అవసరమైన సంఖ్యలో కానిస్టేబుళ్ళు లేకపోవడంతో రాత్రీపగలు డ్యూటీలు చేయలేక సిబ్బంది విసిగిపోతున్నారు.

గంజాయి కేంద్రంగా తిరుపతి

తిరుపతి జిల్లాలో రెండేళ్లుగా ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయి.గత ఆరు నెలల వ్యవధిలోనే తిరుపతి సైబర్ క్రైం స్టేషన్ పరిధిలో దాదాపు 50 కేసులు నమోదయ్యాయి.ఈ కేసులను విచారించి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నారు. కేవలం ఒక సీఐ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ళ పోస్టులు ఖాళీగా వున్నాయి. దీంతో కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఇక మొబైల్ ఫోన్ల చోరీలు లెక్కకు మించి జరుగుతున్నా నిందితులను గుర్తించి అరికట్టడానికి అవసరమైన సిబ్బంది లేరు. మరోపక్క చాలాకాలంగా తిరుపతిలో గంజాయి వాడకం బాగా పెరిగింది. ఇక్కడకు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, రంపచోడవరం, పాడేరు ప్రాంతాల నుంచి కూలీలు ఉపాధి కోసం వలస వస్తున్నారు. వీరి ద్వారా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఇక్కడికి గంజాయి సరఫరా అవుతోంది. యువత, విద్యార్థులు, కూలీలు గంజాయికి అలవాటు పడుతుండడంతో విక్రయాలు బాగా పెరుగుతున్నాయి. సగటున తిరుపతి జిల్లాలో నెలకు 20 కేసులు నమోదు చేస్తున్నారంటే గంజాయి వ్యాప్తి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. వీటికి తోడు ఇళ్లలో దొంగతనాలు, హైవే దోపిడీలు,ద్విచక్ర వాహనాల చోరీలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. వీటన్నింటినీ అరికట్టాలంటే అవసరమైన సంఖ్యలో సిబ్బందిని నియమించాల్సిన అవసరం వుందని పోలీసు అధికారులు సంఘం చెబుతోంది.అయితే పదేళ్లగా ఈ విషయమై తిరుమలకు వస్తున్న హోం మంత్రులకు, డీజీపీలకు సంఘం వినతి పత్రాలు ఇస్తున్నా స్పందించిన దాఖలాల్లేవు.

రేపటినుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్‌తోపాటు మండల కార్యాలయాల్లోనూ ఇక ప్రతి వారం నిర్వహణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 22: వైసీపీ ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన పేరుతో ప్రజల నుంచి అర్జీలను తూతూ మంత్రంగా స్వీకరించేది. పరిష్కారానికి మాత్రం నోచుకునేవి కావని జనం ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈ క్రమంలో చంద్రబాబు సీఎం కాగానే పక్కా ప్రణాళికతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)' ప్రవేశపెట్టారు. దీన్ని జిల్లాలో సోమవారం నుంచి అమలు చేయనున్నారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని డివిజినల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఉదయం 10గంటల నుంచి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కారణంగా అధికారులు బిజీగా ఉండటంతో సోమవారం ఉదయం అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.



చెట్టును ఢీకొన్న కారు - జగన్ మృతదేహం



విశ్రాంతి లేని ప్రయాణానికి ఇద్దరి బలి

- తిరువణ్ణామలైలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు తిరుపతివాసుల దుర్మరణం
- మరో 8 మందికి తీవ్రగాయాలు



మునెమ్మ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూన్ 22: తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రెడ్డిగుంటకు చెందిన పెయింటర్ కె.గోపాల్, ప్రవల్లిక అలియాస్ మునెమ్మ (27) దంపతులు, వీరరాఘవులు భార్య నిర్మల, కుమార్తె లలిత, సుబ్బారెడ్డి నగర్‌లో కాపురమున్న శ్రీకాకుళానికి చెందిన జగన్ (17), ఆయన కుటుంబీకులు ఆదినారాయణ, రుషినాగ దంపతులు, కావిల్‌నాయుడు, జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం కారులో డ్రైవర్ రియాత్‌తో కలిసి తిరువణ్ణామలైకి బయల్దేరారు. మార్గమధ్యంలో కాణిపాకంలోని వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. తర్వాత గోల్డెన్ టెంపుల్‌కు వెళ్లారు. తర్వాత తిరువణ్ణామలైకి చేరుకున్నారు. పౌర్ణమి సందర్భంగా రాత్రికి డ్రైవర్ రియాజ్‌తో కలసి అందరూ కొండచుట్టు తిరిగి బాగా అలసి పోయారు. విశ్రాంతి తీసుకోకుండా శనివారం తెల్లవారు జామున ఐదు గంటలకు తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తిరువణ్ణామలైకి సమీపంలోని కురుమలై వద్దకు 5.30 గంటలకు చేరుకున్నారు. అలసిపోయి ఉన్న డ్రైవర్ తొలుత ఎదురుగా వచ్చిన బస్సును ఢీకొన్నాడు. దాన్నుంచి తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మునెమ్మ, జగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఎనిమిది మందీ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను తిరువణ్ణామలై ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తిరుపతిలోని బాధితుల ఇళ్ల వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరూ కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది.

ఆ ఉద్యోగులపై కొరడా

ఎన్నికల విధులకు డుమ్మా కొట్టి వివరణ ఇవ్వనివారిపై ఉన్నతాధికారుల సీరియస్

గతంలో చర్యలు తీసుకోకుండా వైసీపీ పెద్దలు అడ్డుకున్న వైనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరిగిన పోలింగ్ విధులకు జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 272మంది ఉద్యోగులు గైర్హాజరయ్యారు. వీరందరికీ షోకాజు నోటీసులు జారీ చేశారు. అయితే కొందరు మాత్రం వివరణ ఇవ్వలేదు. ఇలా వివరణ ఇవ్వని వారిపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించనున్నారు. వివరాలిలా ఉన్నాయి. షోకాజ్ నోటీసులు అందుకున్న సగం మంది అనారోగ్య కారణాలు చూపుతూ మెడికల్ సర్టిఫికెట్లతో వివరణ ఇచ్చారు. ఇంకొంతమంది తమకు ఎన్నికల విధులు రెండుచోట్ల కేటాయించారని తెలియజేశారు. మిగిలిన వారు మాత్రం తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాతో ఎటువంటి వివరణ ఇవ్వలేదు. దీనికి నిదర్శనంగా వీరిపై చర్యలు తీసుకోవడానికి ఓ జిల్లా ఉన్నతాధికారి ప్రయత్నం చేసినా వైసీపీ పెద్దలు అడ్డుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత దీనికి సంబంధించిన ఫైలు మూలన పడింది. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఆ ఫైల్‌లో కదలిక వచ్చింది. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని బదిలీపై వెళ్లిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వివరణ ఇవ్వని సుమారు 30మందికిపైగా సస్పెన్షన్ వేటుకు గురికానున్నారని తెలుస్తోంది.

ఆ ఏడుగురి మాటేమిటి?

గతంలోనూ ఎన్నికల రెండో దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన ఏడుగురిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు కలెక్టర్ పేరుతో సమాచార అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. తీరా పరిశీలిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. ఇది సమాచార శాఖ లోపమా లేదా ఈ ఏడుగురిపై కూడా వేటు పడకుండా వైసీపీ పెద్దలు కాపాడారా? అనే దానిపై ఈ ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ ఇద్దరి మృతి



మృతి చెందిన సాయికృష్ణ, ఈశ్వర్

నింద్ర, జూన్ 22: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన నింద్ర మండలంలోని కొప్పేడు వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీరాంపురం దళితవాడకు చెందిన ఈశ్వర్(47) పుత్తూరు ఆర్టీసీ డిపోలో ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. సాయికృష్ణ(24) మరో వ్యక్తితో కలిసి శ్రీరామపురం నుంచి పాలమంగళానికి బైక్‌లో వెళుతున్నాడు. కొప్పేడు సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. గాయపడిన వ్యక్తిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ రామచంద్రయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్



చిత్తూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ షన్మోహన్ కాకినాడకు బదిలీ అయ్యారు. సుమిత్‌కుమార్ 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌గా పనిచేశారు. హర్యానా రాష్ట్రం రోహతక్ జిల్లాకు చెందిన సుమిత్‌కుమార్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక నాలుగేళ్ల ఐటీ ప్రొఫెషనల్‌గా ఉద్యోగం చేశారు.

'క్వార్ట్జ్' అక్రమాలపై సీబీఐతో విచారణ

- ఉమ్మడి జిల్లా అభివృద్ధే ధ్యేయంగా నడుద్దాం
- వీపీఆర్ నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేల తీర్మానం



వేమిరెడ్డి దంపతులతో భేటీ అయిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 22: జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తీర్మానించారు. అలాగే, ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేద్దామని నిర్ణయించుకున్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు శనివారం తాడేపల్లిలోని తమ నివాసంలో భేటీ అయ్యారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే అంశాలపైనా వారు చర్చించారు.

దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం చేపట్టాలి



నిరసన కార్యక్రమంలో చింతామోహన్ తదితరులు

గూడూరు/సూళ్లూరుపేట/వెంకటగిరిటౌన్, జూన్ 22: దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తీసుకురావాలని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మోదీ ప్రధాని అయ్యాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని బీజేపీ రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చందన మూడి శివ, రాజేంద్ర, నాగూరయ్య పాల్గొన్నారు. అలాగే వెంకటగిరి తెలుగు గంగ అతిథి గృహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మన్నవరం భెల్ ఫ్యాక్టరీకి వేసిన పునాది రాయి నేడు అనాథ రాయిగా మిగిలిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి భెల్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు.

యువతకు టీడీపీలో పెద్దపీట: నెలవల



టీడీపీ యువ నేత పృథ్వీ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట టౌన్, జూన్ 22: తెలుగుదేశంపార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నట్లు మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి పార్టీ యువ నేత హంసా పృథ్వీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులను టీడీపీ నాయకులు సన్మానించారు. అనంతరం పృథ్వీ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. టీడీపీ నాయకులు పసల చెంగయ్య, గాలి రాజేష్ నాయుడు, సూరి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల రాజీనామా

గూడూరు అర్బన్, జూన్ 22: స్థానిక ధర్మరాజులస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు శనివారం రాజీనామా చేసినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బీ.శ్రీనివాసులుతోపాటు సభ్యులు రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, జూన్ 22: సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ఖాదర్ బాషా తెలిపారు. 220 కేవీ లైన్ల మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ ఉండదని వినియోగదారులు, రైతులందరూ సహకరించాలని పేర్కొన్నారు.

నిలకడగా నిమ్మధరలు

గూడూరు అర్బన్, జూన్ 22: దేశీయంగా ప్రసిద్ధి చెందిన గూడూరు నిమ్మమార్కెట్‌లో నిమ్మధరలు నెలరోజులుగా నిలకడగా కొనసాగుతున్నాయి. శనివారం నిమ్మధరలు కేజీ నాణ్యతను బట్టి కనిష్ఠంగా రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.80 పలికింది. గతేడాది జూన్ మాసంలో గరిష్ఠ ధర రూ.40 ఉండగా, ప్రస్తుతం రెట్టింపు ధర పలకడం విశేషం. ఈ ఏడాదిలో నిమ్మధరలు గరిష్ఠంగా కేజీ రూ.130 వరకు పలికాయి. ఉత్తర భారతదేశంలో పలు ప్రాంతాలలో వర్షాలు విస్తారంగా కురిసి వేసవితాపం తగ్గుముఖం పట్టినప్పటికీ నిమ్మధరలు స్థిరంగా ఉండటంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తైవాన్ రకం నిమ్మ ధరలకు కుడా రూ.30 నుంచి రూ.50 వరకు ధర పలికింది.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఏసురత్నం

చిట్టమూరు, జూన్ 22: మండల పరిధిలోని గునపాటిపాళెం మలుపు వద్ద మూడు రోజుల క్రితం మోటరు సైకిల్ ప్రమాదవశాత్తు కాలువలో పడి టి.ఏసురత్నం (36)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు గునపాడు గిరిజన కాలనీకి చెందిన ఏసురత్నం గురువారం రాత్రి నాయుడుపేట నుంచి మోటరు సైకిల్‌పై గునపాడుకు వస్తుండగా ప్రమాదం జరిగి కాలువలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఏసురత్నంను ఎవరూ గుర్తించకపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు. శనివారం కాలువ సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు చూడగా వ్యక్తి చనిపోయినట్లు గుర్తించి ఎస్‌ఐ చిన్నబలరామయ్యకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఏసురత్నం తీవ్రంగా గాయపడి నీళ్లల్లో పడిపోవడం వలన ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌గా రజనీకుమారి

కోట, జూన్ 22: కోటలోని యానాదుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శనివారం రజనీకుమారి బాధ్యతలు చేపట్టారు. ఓజిలి గురుకులం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రజనీకుమారిని కోటకు బదిలీ చేయగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శుభకర్‌రావు ఆమెకు బాధ్యతలను అప్పగించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి బాబు, స్థానికులు

చిల్లకూరు, జూన్ 22: మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడకు చెందిన ఆనందయ్య కుటుంబానికి శనివారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయంగా రూ. 10వేలు అందజేశారు. ఆనందయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందించినట్లు ట్రస్ట్ ప్రతినిధి తెలిపారు. ఈ నగదును ట్రస్ట్ ప్రతినిధి బాబు చేతుల మీదుగా ఆనందయ్య భార్య లక్ష్మమ్మకు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు రాధయ్య, సుబ్బయ్య, ఆర్ముగం తదితరులు ఉన్నారు.

చిన్నారులకు టీకాలు

కోట, జూన్ 22: కోట పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు టీకాలు వేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, ఎఎన్‌ఎంలు బుజ్జమ్మ, వనజలు ఆయా టీకాలను అందజేశారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



గూడూరు, జూన్ 22: స్థానిక రాజావీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవార్లను, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గజవాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

డంపింగ్ యార్డ్ ప్రమాదం బీమా సొమ్ము కోసమేనా?



కాలిపోయిన వ్యర్థాలపై మట్టితో కప్పేస్తున్న దృశ్యం

తడ, జూన్ 22: అనధికారికంగా నిర్వహిస్తున్న పరిశ్రమల వ్యర్థాల డంపింగ్‌యార్డు అగ్ని ప్రమాదం బీమా సొమ్ముల కోసమేనా... అంటే అవుననే సమాధానం వస్తోంది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఇది సొమ్ముల కోసమే చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాంబట్టు సెజ్‌లోని ఏపీఐఐసీ భూముల్లో అనధికారిక డంపింగ్ యార్డులో ఈనెల 10న భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. సుమారు మూడు రోజులపాటు మంటలు అదుపులోకి రాలేదు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్ పేరుతో భూములను పొందిన సదరు సంస్థ పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ చేస్తుంటే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను రోజుకు కొంత కాలుస్తున్న క్రమంలో భారీ అగ్నిప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. డంపింగ్‌యార్డులో జరిగిన ప్రమాదాన్ని సదరు వ్యక్తి రూ.25లక్షల బీమా రూపేణ రాబట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై తమకు అనుకూలంగా కేసు నమోదు చేయాలని ఓ రాజకీయ నాయకుడి ద్వారా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అనధికారికంగా నడుపుతున్న ఈ డంపింగ్ యార్డులో జరిగిన ప్రమాదానికి సదరు వ్యక్తికి ఏపీఐఐసీ అధికారులు కానీ, పొల్యూషన్ బోర్డు, పంచాయతీ అధికారుల ఇప్పటివరకు నోటీసులు జారీ చేయకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా అగ్నిప్రమాద వ్యర్థాలను సదరు వ్యక్తి అదే స్థలంలో గుంతలు తీసి పూడ్చివేస్తున్నారు. గమనించిన కాదలూరు గ్రామస్తులు శనివారం పూడ్చివేతను అడ్డుకున్నారు. ఈ ప్రమాదంపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ... భూములను లీజుకు తీసుకున్న వ్యక్తికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఆ నోటీసులకు వివరణ వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని ప్రమాద బీమాపై కూడా విచారణ జరుపుతామన్నారు.

బీసీ గురుకులాల్లో అదనపు సీట్లు కేటాయించండి: ఎమ్మెల్యే పాశిం



అనంతరాముతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, జూన్ 22: నియోజకవర్గ పరిధిలో బీసీ గురుకులాల్లో విద్యార్థుల కోసం అదనపు సీట్లను కేటాయించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం అమరావతిలో బీసీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరామును కలిసి ఈ విషయమై ఆయన విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో వెనుకబడిన తరగతులకు సంబంధించిన విద్యార్థులు అధికంగా ఉన్నారన్నారు. దీంతో బీసీ గురుకులాల్లో అదనపు సీట్లు కానీ, అదనపు సెక్షన్‌లను మంజూరు చేయించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో నాల్గవ వార్షికోత్సవ శిక్షణా శిబిరం



అవగాహన కల్పిస్తున్న కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే

కోట, జూన్ 22: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 4వ విడత వార్షిక శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 10 ఆంధ్రా నేషనల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులకు ఈ శిక్షణ జరిగింది. విద్యార్థులకు డ్రిల్, వ్యక్తిత్వవికాసం, గన్ ఫైరింగ్, రెగ్గింగ్, ప్రకృతి వైపరీత్యాలు నివారణ చర్యలు, సామాజిక అవగాహన తదితర అంశాలపై అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్లు శిక్షణ ఇచ్చారు. పలు జిల్లాల నుంచి 645 మంది ఎన్‌సిసి క్యాడెట్‌లు హాజరయ్యారు. పీడీ మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్రబాబు, నాగరాజు, పెంచలయ్య, మస్తానయ్య తదితరులు ఉన్నారు.

బీసీ గురుకులానికి రుణపడి ఉంటాం



ప్రిన్సిపాల్‌కు యూనిఫాం అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

కోట, జూన్ 22: కోటలోని బీసీ గురుకులానికి రుణపడి ఉంటామని పూర్వపు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం 2003-2004 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కొరాడ నారాయణరావును పూర్వపు విద్యార్థులు సన్మానించారు. ఇక్కడ గురుకులం రాష్ట్రస్థాయిలో టెన్త్, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించి మొదటిస్థానంలో ఉండటంతో, అక్కడ ఉపాధ్యాయులు, నారాయణరావులను పూర్వపు విద్యార్థులు షీల్డ్‌లు, మెమెంటోలతో సత్కరించారు. పాఠశాలలో పూర్వపు విద్యార్థులు సొంత ఖర్చులతో సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపేదలకు ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట, జూన్ 22: నాయుడుపేట రైల్వేస్టేషన్, బస్టాండ్ ముఖ్యకూడలి ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు శనివారం తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యుడు నెల్లూరు నాగరాజు ఆహారపొట్లాలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గుమ్మిడిపూడి బాబురెడ్డి, నదియ దంపతుల సహకారంతో నిరుపేదలకు ఆహారపొట్లాలు, వాటర్‌బాటిళ్ల అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెళ్లకూరు, జూన్ 22: నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాల మేరకు మండలంలోని దిగువ చావాలి గ్రామానికి చెందిన కామిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మోటర్ సైకిల్‌పై పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళుతుండగా, పెళ్లకూరు వద్ద నెల్లూరు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి వెళ్తున్న కారు ప్రమాదవశాత్తున ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోవర్ధన్‌రెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

పెళ్లకూరు, జూన్ 22: ప్రజా సమస్యలు, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి 24 గంటల లోపు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం, అంటు వ్యాధులపై ఇంచార్జీ కలెక్టర్ ధ్యానచంద్ర మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఇద్దరు బాలకార్మికులకు విముక్తి



బాలకార్మికుడి తల్లికి కౌన్సిలింగ్ ఇస్తున్న లేబర్ అధికారులు

కోట, జూన్ 22: మండల పరిధిలోని కోట పట్టణం, విద్యానగర్ ప్రాంతాలలో శనివారం లేబర్ అధికారులు పలు దుకాణాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు అనిల్, సత్యనారాయణల ఆధ్వర్యంలో కోట పట్టణంలోని రెండు దుకాణాలలో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ఆయా దుకాణదారులకు నోటీసులు జారీచేశారు. బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యాసామగ్రి అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, జూన్ 22: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వాసవీక్లబ్ సభ్యులు అన్నారు. శనివారం వేములపాళెం ప్రాథమిక పాఠశాలలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శివప్రసాద్, లలిత, సునీత పాల్గొన్నారు.

శ్రేష్ఠలో పేట విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నాయుడుపేట టౌన్, జూన్ 22: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షైనీయాక్సీబా శ్రేష్ఠ నెట్స్ 2024 జాతీయస్థాయిలో 228 ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం పాఠశాల ప్రాంగణంలో షైనీ యాక్సీబాను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు జ్ఞాన ప్రసూనాంబ, రవిశేఖర్, మధు, వరకుమార్, మంజుల, సుధారాణి, కవిత, వజన తదితరులు ఉన్నారు.

ముగిసిన హుస్సేనమ్మ దర్గా గంధోత్సవాలు



దర్గాను దర్శించు కొంటున్న భక్తులు

దొరవారిసత్రం, జూన్ 22: దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామంలోని హుస్సేనమ్మ దర్గా గంధోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. మూడవ రోజు దర్గాలో ఉంచిన గంధాన్ని నిర్వాహకులు భక్తులకు పంచి పెట్టారు. దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఎస్‌ఐ తిరుమలరావు భద్రతా చర్యలు చేపట్టారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

గూడూరు అర్బన్, జూన్ 22: మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని రోటరీవెస్ట్ క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం చెన్నూరు గిరిజనకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాశిన నాగులు, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

తడలో 'నేను బడికిపోతా' ర్యాలీ

తడ, జూన్ 22: 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నేను బడికిపోతా కార్యక్రమం తడలో శనివారం జరిగింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఐఈఆర్‌టి కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో మల్లికార్జున్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

తడ, జూన్ 22: చిన్నమాంబట్టులో వెలసి ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి అన్నపూర్ణాదేవి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం వ్యవస్థాపకులు తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివార్లకు కుంకుమార్చన, పాలాభిషేకం, గోపూజలు జరిగాయి.

పేదలకు అన్నదానం

వెంకటగిరిటౌన్, జూన్ 22: స్థానిక బొప్పాపురంలో రాధాకృష్ణ మందిరంలో స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం నిర్వహించారు. యువసైన్యం సభ్యులు గోపీనాథ్, పోతులూరు, భద్రం, శివకుమార్, మురళి, నాగభూషణం, ప్రహ్లాద్, ప్రవీణ్‌కుమార్, మునెయ్య, బాస్కర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరి మృతి

డక్కిలి, జూన్ 22: డక్కిలి మండలం పలుగోడు గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలాయపల్లి మండలం పాపబాంబపురం గ్రామానికి చెందిన మన్నూరు పోతయ్య(32), వీరబాబు(40)లు చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... బాలాయపల్లి మండలం పాపమాంబపురం గ్రామానికి చెందిన పోతయ్య, వీరబాబు, సునీల్‌లు రాపూరులో పనుల నిమిత్తం వెళ్లి మోటర్‌సైకిల్‌లో తిరిగి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి పలుగోడు గ్రామం వద్ద వెంకటగిరి నుంచి ఎదురుగా వస్తున్న చేపల లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటర్ సైకిల్‌పై వున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చికిత్స పొందుతున్న వీరిలో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ పరిస్థితి మెరుగ్గావున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.